క్లుప్తంగా

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



పటమట(విజయవాడ తూర్పు): లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నగర పాలక సంస్థ అధికారులను మేయర్ రాయన భాగ్యలక్ష్మి బుధవారం ఆదేశించారు. కృష్ణానది, బుడమేరు పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, వరద ముంపు ప్రాంతాల వారిని దగ్గరలోని పునరావాస కేంద్రాలకు చేర్చాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వసతులు కల్పించాలని పేర్కొన్నారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మవద్దని సూచించారు. నగర పాలక సంస్థ ఎల్లప్పుడు ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని మేయర్ భాగ్యలక్ష్మి భరోసా ఇచ్చారు.

83 మందికి జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 83 మందికి న్యాయస్థానం జరిమానాలు విధించింది. నగరంలోని ఆరో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 83 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని 6వ, 7వ అడిషనల్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌ల కోర్టుల్లో హాజరు పరచగా న్యాయమూర్తులు లెనిన్‌బాబు, ఆర్.వి.ఎస్.శర్మ జరిమానాలు విధించారు.

లక్ష్యంతోనే ముందడుగు వేయాలి



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు లక్ష్యంతో ముందడుగు వేసినప్పుడు అనుకున్న విజయాలను అందుకుంటారని అలయిన్స్ విశ్వవిద్యాలయం (బెంగళూర్) ఉపకులపతి డాక్టర్ బి.ప్రీస్ట్‌లీ షాన్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మొదటి ఏడాది బీటెక్ విద్యార్థులకు తొలి రోజు స్వాగత కార్యక్రమాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. గౌరవ అతిథిగా హాజరైన ఎఫెక్ట్రానిక్స్ అధినేత దాసరి రామకృష్ణ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై పట్టు సాధించాలని, కొత్త అధ్యయనాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, ఉపాధ్యక్షుడు పొట్టి సురేంద్రకుమార్, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్, కేబీఎస్ కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాసు, హిందూహైస్కూల్స్ కమిటీ ఏవో నారాయణరావు ప్రసంగించారు.

ఇగ్నో ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ విద్యార్థులకు పరిసర ప్రాంత గృహ నివాసులకు ఉచితంగా ఇంటింటికీ జాతీయ జెండాలను బుధవారం పంపిణీ చేశారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కె.సుమలత జెండాలను పంపిణీ చేశారు. హిందూహైస్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సిబ్బంది హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుమలత మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా దేశ సమైక్యతను పెంపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను ఇంటిలోని కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల ఉన్న స్థానికులకు కూడా తెలియజేయాలని కోరారు. ఇగ్నో సిబ్బంది డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ శరత్‌చంద్ర, బాల చందర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంచెర్ల శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారి బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణనాథుని మట్టి విగ్రహ నమూనా కరపత్రం ఆవిష్కరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 72 అడుగుల గణనాథుని మట్టి విగ్రహ నమూనా చిత్రంతో ముద్రించిన కరపత్రాన్ని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో 72 అడుగుల ఎత్తులో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు అభినందనీయులన్నారు. డూండీ గణేష్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ ఈ ఏడాది శ్రీకార్యసిద్ధి మహాశక్తి గణపతిగా డూండీ వినాయకుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు గద్దం రవి, ముక్తేశ్వరరావు, పేర్ల రవి, ఆలపాటి సత్యనారాయణ, కె.డి.శ్రీను, దర్శి సుబ్బారావు, నాగేశ్వరరావు, చైతన్య, బాలు, పాల మాధవ పాల్గొన్నారు.

జల దిగ్బంధంలో ఆర్టీసీ డిపో, జోనల్ వర్క్‌షాప్

- లోపలకు వెళ్లేందుకు వీలులేక రోడ్డుపైనే ఉద్యోగులు
- వర్క్‌షాప్‌లో మెషినరీ సెక్షన్ జలమయం
- లేబర్ కాలనీ నుంచి వర్క్‌షాప్ రోడ్డులోకి కట్టిన కాలువే కారణం



ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ జలమయం కావడంతో బయట వేచి ఉన్న ఉద్యోగులు



జలమయమైన విద్యాధరపురం ఆర్టీసీ డిపో



నీటిలో ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ లోపల ప్రాంతం



జోనల్ వర్క్‌షాప్‌లో జలమయమైన మెషినరీ విభాగం



జల దిగ్బంధంలో వర్క్స్ మేనేజర్ కార్యాలయం



ఆరు భవనాల్లోని ఓ ఇంట్లోకి నీళ్లు వచ్చేయడంతో మంచంపై ముడుచుకుని పడుకున్న వృద్ధురాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని విద్యాధరపురం ఆర్టీసీ డిపో, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డులోని ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్, టైర్ షాప్ జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి బైపాస్ రహదారిలో లోతట్టులో ఉన్న ఆర్టీసీ డిపో గేటు బయట వరకు పూర్తిగా నీటితో నిండిపోయింది. దీంతో బయట నుంచి డిపో లోకి, డిపోలో నుంచి బయటకు బస్‌ల రాకపోకలు నిలిచిపోయాయి. ఇక జోనల్ వర్క్‌షాప్ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. విధులకు హాజరయ్యేందుకు ఉదయం 8 గంటలకే వచ్చిన ఉద్యోగులు లోపలకు వెళ్లేందుకు అవకాశం లేక అటు వర్క్స్ మేనేజర్ కార్యాలయం వద్ద, ఇటు జోనల్ వర్క్‌షాప్ గేట్ ముందు ఉండిపోయారు. వర్క్‌షాప్ లోపల ఉన్న మెషినరీ విభాగం షెడ్లు అన్నింటిలోనూ నీళ్లు నిలిచాయి. మెషినరీ సెక్షన్‌కు సంబంధించిన అన్ని పరికరాలు, మోటార్లు తదితర వస్తువులన్నీ వర్షపు నీటిలో తేలియాడుతున్నాయి. వర్క్స్ మేనేజర్ కార్యాలయం సమీపంలో ఉన్న లేబర్ కాలనీలో నుంచి ఇటీవల నిర్మించిన డ్రెయిన్ ద్వారా కాలనీలోని నీరంతా నేరుగా వర్క్‌షాప్ ప్రహరీ గోడకుగల కచ్చా డ్రెయిన్‌లో కలవటమే జోనల్ వర్క్‌షాప్ ముంపునకు కారణమని ఆర్టీసీ ఉద్యోగులు చెబుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల అనాలోచిత పనుల వలనే ఈ దుస్థితి దాపురించిందని వ్యాఖ్యానిస్తున్నారు.

జలమయమైన ఆరు భవనాలు

విద్యాధరపురం న్యూ లేబర్‌కాలనీలోని ఆరు భవనాల ప్రాంతం జలమయమైంది. ఇళ్లల్లోకి వర్షపు నీరు వెళ్లిపోవడంతో సామాన్లను మంచాలపై పెట్టుకున్నారు. నీళ్లను బకెట్లతో తోడి బయట పోసుకుంటున్నారు. బుడమేరు వరద ముంపునకు గురై అతలాకుతలమైన ఆరు భవనాల నివాసితులు ఇప్పుడు ఈ వర్షానికి మళ్లీ ముంపునకు గురికావడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే శిథిలావస్థలో ఉండి ఎప్పుడు కూలిపోతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ క్షణమొక యుగంలా గడుపుతున్నారు. భవానీపురంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, ప్రియదర్శిని కాలనీలు నీట మునిగి ఇళ్లల్లోకి నీరు రావడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. వాజ్‌పేయి పార్క్ పక్కనగల కుండల బజారు, విద్యాధరపురంలోని కుమ్మరి బజార్ జలమయమయ్యాయి.

ప్రత్యేక బృందాలు అప్రమత్తంగా ఉండాలి

మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాన్సూన్ రెస్పాన్స్ టీములు, ఫ్లడ్ రెస్పాన్స్ టీములు అప్రమత్తంగా ఉండాలని మునిసిపల్ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆదేశించారు. కృష్ణానది, బుడమేరు పరీవాహక ప్రాంతాలకు వరద ముప్పు ఉన్నందున ధ్యానచంద్ర బుధవారం గుణదల వద్దగల పుల్లేటి కట్ట డ్రెయిన్, టిక్కిల్ రోడ్డు, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, నిర్మల కాన్వెంట్ రోడ్డు, డెంటల్ కాలేజీ రోడ్డు, ఈఎస్ఐ రోడ్డు, దళితవాడ, ఏలూరు రోడ్డు, బుడమేరు ఏలూరు కాలవ మధ్యకట్ట, ఆర్టీసీ లేబర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరద ముంపు ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు పునరావాస కేంద్రాలకు వెంటనే తరలి వెళ్లాలని, వారికి ప్లానింగ్ సిబ్బంది అవగాహన కల్పించాలని, మైకుల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. వరద ముంపు ప్రాంతాలకు ఫ్లడ్ రెస్పాన్స్ టీములు 24 గంటలూ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తూ, వరద నీరు నివాస ప్రాంతాల్లోకి రాకుండా ఎప్పటికప్పుడు గల్వార్లు, ఆయిల్ ఇంజిన్లతో తోడేయాలని ఆదేశించారు. వర్షపునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మాన్సూన్ రెస్పాన్స్ టీములు అప్రమత్తంగా ఉంటూ, ఎప్పటికప్పుడు రోడ్లపై నీటిని తోడేయాలని సూచించారు. సర్కిల్–1లో 13, సర్కిల్–2లో 19, సర్కిల్–3లో ఏడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న భారీ వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, వదంతులను నమ్మవద్దని పేర్కొన్నారు. స్థానికులకు ఇబ్బందులు ఉంటే సమీపంలోని సచివాలయాన్ని సంప్రదించాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ప్రతి సచివాలయంలో స్థానిక పునరావాస కేంద్రాలను తెలిపేలా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్ కె.షమ్మీ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

భయపెడుతున్న బుడమేరు

- వైఎస్సార్ కాలనీ వద్ద పెరుగుతున్న నీటిమట్టం
- ఆందోళనలో కాలనీ వాసులు



కాలనీ మధ్య నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు కాల్వ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరులో వరద నీటి ప్రవాహం వేగం పుంజుకోవడంతో వైఎస్సార్ కాలనీవాసుల్లో ఆందోళన పెరుగుతోంది. బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు బుడమేరులో వరద నీటి మట్టం క్రమక్రమంగా పెరుగుతూ రావడంతో కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఆగస్టు నెలాఖరులో సంభవించిన బుడమేరు ముంపు కళ్ల ముందు కదలాడుతున్నట్లు కాలనీవాసులు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో కాలనీలో పలు చోట్ల వర్షం నీరు నిలిచిపోవడం, బుధవారం ఉదయం నుంచి బుడమేరులో నీటిమట్టం పెరగడంతో ఆందోళన మరింత తీవ్రతరమైంది. స్థానికులు కాల్వ వద్దకు వెళ్లి బుడమేరులో పెరుగుతున్న నీటి మట్టాన్ని పరిశీలిస్తున్నారు. మరో వైపున కాలనీలోని ఫ్లాట్లలో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసాలు ఉన్న వారు తమ విలువైన వస్తువులు, సామగ్రిని ముందుగానే భద్రపరుచుకుంటున్నారు. గత ఏడాది అనుభవాల దృష్ట్యా ఫ్లాట్లలోని మొదటి అంతస్తులోకి తమ సామాన్లు చేర్చుతున్నామని వారు చెబుతున్నారు. బుడమేరు నుంచి వరద నీరు రోడ్లపైకి వచ్చిన వెంటనే కుటుంబ సమేతంగా నగరంలోకి తరలివెళ్లేందుకు మరికొన్ని సామాన్లు భద్రపరుచుకోవడం కనిపించింది.

జలమయమైన వైఎస్సార్ కాలనీ



వైఎస్సార్ కాలనీలో జలమయమైన హైస్కూల్ ముందున్న ఖాళీ స్థలం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా జక్కంపూడి వైఎస్సార్ కాలనీ జలమయమైంది. ముఖ్యంగా కాలనీలోని మండల పరిషత్ హైస్కూల్ ముందున్న ఖాళీ స్థలం మొత్తం వర్షపు నీటితో నిండిపోయింది. దాంతో కాలనీలోని పిల్లలు ఆ నీటిలో ఆడుకుంటున్నారు. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, సైడు కాలువలు నిండిపోయి రోడ్డు మీద ప్రవహిస్తున్నాయి. కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో సంభవించిన బుడమేరు వరదలు గుర్తుకు వచ్చి బుడమేరు కాలువ పక్కనే ఉన్న బ్లాకుల్లో నివసిస్తున్నవారు ఆందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో బుడమేరు పొంగి కాలనీలోకి నీళ్లు వస్తాయోనని భయపడుతున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



జీఎస్ఆర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థులతో అవగాహన ర్యాలీ



వైఎస్సార్ కాలనీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న యూసఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): చెడు అలవాట్ల వైపు మొగ్గు చూపుతుండటం బాధాకరమని, ముఖ్యంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కల్పించాలని ఐసీడీఎస్(ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్) ప్రాజెక్ట్–1 సెక్టార్–2 సూపర్‌వైజర్ షేక్ జహీదా బేగం పేర్కొన్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోగల జీఎస్ఆర్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం నిర్వహించిన నషాయుక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలు పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయులు బోధించే చదువుపైనే దృష్టి పెట్టాలని, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి ఆశయాలకు అనుగుణంగా బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రామరాజ్యనగర్ అంగన్‌వాడీ టీచర్లు పావని, లక్ష్మి, బాజీ, లక్ష్మి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీ ఎలిమెంటరీ స్కూల్‌లో..

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ యూసఫ్ అధ్యక్షతన నషాయుక్త భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. రాష్ట్రాన్ని మత్తు పదార్థాలు, మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దటానికి శక్తి మేరకు కృషి చేస్తానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అటువంటి వ్యక్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాధవి, సువర్చల, మంజుల పాల్గొన్నారు.

టీములు సరే.. క్విక్ రెస్పాన్స్ ఏదీ..?

- నగరంలోని 42 ప్రాంతాల్లో మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీంల ఏర్పాటు
- మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని భారీ ప్రచారం
- ఆచరణలో మాత్రం ఈ టీముల పనితీరు శూన్యమని విమర్శలు
- క్విక్ రెస్పాన్స్ టీములు పనిచేస్తే ముగ్గురు మృతిచెందేవారు కాదని వాదన
- డ్రెయినేజీ నిర్మాణ ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం



వీఎంసీ ఏర్పాటు చేసిన మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీంలు వరద నీటిని తోడే యంత్రాలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో చినుకు పడితే చింతించాల్సిందే. భారీ వర్షం పడితే బయటకు వెళ్లిన వ్యక్తులు తిరిగి ఇంటికి వచ్చే వరకు కుటుంబ సభ్యులకు ఆందోళనే. నగర ప్రజలకు తక్షణ సహాయ సహకారాలు అందించేందుకు ఏర్పాటుచేసిన మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీములు పనిచేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రోడ్లపైకి చేరిన వర్షపునీరు, వాగులను తలపిస్తూ ఉప్పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు ప్రజలను భయపెడుతున్నాయి. నానాటికీ పెరుగుతున్న జనాభా దృష్ట్యా నగరపాలక సంస్థ సరైన డ్రెయినేజీని ఏర్పాటు చేయకపోవటంతో ఏటా వర్షాకాలంలో డ్రెయిన్లలో పడి వ్యక్తులు చనిపోతూనే ఉన్నారు. తాజాగా వన్‌టౌన్‌లో ఇద్దరు, గుణదలలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది పటమటలో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పడి చిన్నారి మృతి చెందిన విషయం తెలిసిందే. డ్రెయిన్ల నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఎలాంటి హెచ్చరిక/సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేరుకే క్విక్ రెస్పాన్స్ టీములు

నగరంలోని వరద రాకముందు, వచ్చినప్పుడు, తర్వాత తీసుకునే చర్యలకు సంబంధించి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఆర్భాటంగా మాన్‌సూన్ క్విక్ రెస్పాన్స్ టీములను ఏర్పాటు చేశారు. నగరంలో గుర్తించిన 42 ప్రాంతాల్లో ఈ టీముల కోసం షెల్టర్లు ఏర్పాటు చేశామని, భారీ వర్షాలు కురిసినప్పుడు తక్షణం సహాయక చర్యలు చేపట్టడం, ప్రజలను అప్రమత్తం చేసేందుకు మైక్‌లతో ప్రచారం నిర్వహించడం, రోడ్లపైకి చేరిన వర్షం నీటిని యంత్రాలతో ఎప్పటికప్పుడు క్విక్ రెస్పాన్స్ టీముల సిబ్బంది తోడేస్తారని నగరపాలక సంస్థ అధికారులు ప్రచారంతో హోరెత్తించారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తారని గొప్పలు చెప్పారు. ఈ టీములు వాస్తవంగా విధులు నిర్వహిస్తే నగరంలో డ్రెయిన్లలో పడి ముగ్గురు ఎలా మృతిచెందుతారని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వేసవి తర్వాతే పనులు ప్రారంభం

నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో 42 ప్రాంతాల్లో వర్షపు నీటి మళ్లింపునకు డ్రెయిన్ల నిర్మాణానికి ఈ ఆర్థిక సంవత్సరంలోనే నగరపాలక సంస్థ రూ.17.30 కోట్లు వెచ్చిస్తోంది. సర్కిల్–1 పరిధిలోని 10, సర్కిల్–2 పరిధిలో 19, సర్కిల్–3 పరిధిలోని 13 ప్రాంతాల్లో స్టామ్‌వాటర్ డ్రెయిన్ పనులను ప్రారంభించింది. సుమారు 50 కిలోమీటర్ల మేర వేసవి తర్వాత స్టామ్‌వాటర్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం మూడు కిలోమీటర్ల మేర మాత్రమే నిర్మాణం పూర్తయింది. 47 కిలోమీటర్ల మేర పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

నగరంలో వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలు ఇలా..

నగరంలో అత్యధికంగా వర్షపు నీరు నిల్వ ఉండే 40 ప్రాంతాలను నగరపాలక సంస్థ గుర్తించింది.

సర్కిల్–1 పరిధిలో..

కాశేశ్వరరావు మార్కెట్ వద్ద ఉన్న లోబ్రిడ్జి, దుర్గగుడి సమీపంలోని మసీదు వద్ద, భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్ వెంబడి, కుమ్మరిపాలెం సెంటర్, వీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న అండర్‌పాస్ వద్ద అత్యధికంగా నీరు నిలువ ఉంటుంది.

సర్కిల్–2 పరిధిలో..

ప్రకాశం రోడ్డులోని లత సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద, ఏలూరు రోడ్డులోని విజయ టాకీస్ సెంటర్, ఆంజనేయస్వామి గుడి, వేముల శ్యామలదేవీ రోడ్డు, ప్రకాశంరోడ్డులోని ప్రజావైద్యశాల, సత్యనారాయణపురంలోని స్వర ఆస్పత్రి, భానునగర్, లోటస్ ల్యాండ్‌మార్క్, రామమందిరం రోడ్డు, వ్యాకరణం రోడ్డు, గాంధీనగర్ ఎన్నార్పీ రోడ్డు, అజిత్‌సింగ్‌నగర్ ఆర్‌యూబీ, పటేల్‌నగర్, ఎల్‌బీఎస్ నగర్‌లోని అంతర్గత రోడ్లు, రాజీవ్‌నగర్ కట్ట అంతర్గత రోడ్లు, సింగ్‌నగర్ ప్రధాన రహదారి, నూజివీడు రోడ్డు, బర్మా కాలనీ, బందరురోడ్డులోని రాఘవయ్య పార్కు వద్ద, ఇన్నర్ రింగ్‌రోడ్డు రామవరప్పాడు వైపు, మధురానగర్ ఆర్‌యూబీలో నీరు అత్యధికంగా నిల్వ ఉంటుంది.

సర్కిల్–3 పరిధిలో..

పుల్లేటికట్ట డ్రెయిన్, బాయన బాపూజీ రోడ్డు, ఆయూష్ ఆస్పత్రి, విజేత సూపర్‌మార్కెట్ ఎదురు, జాతీయ రహదారి వెంబడి గురునానాక్ కాలనీ జంక్షన్ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లే రోడ్డు, రమేష్ ఆస్పత్రి నుంచి జంక్షన్ డీవీ మేనర్ రోడ్డు, పిన్నమనేని పాలి క్లినిక్‌రోడ్డు, బందరురోడ్డులో బెంజిసర్కిల్, హోటల్ మార్గ్ కృష్ణాయ, నిర్మల కాన్వెంట్ రోడ్డు, బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు రోడ్డుకు ఇరువైపులా, రేడియో స్టేషన్ ఎదురుగా, ఏపీఐఐసీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, ఎయిర్ పోర్టు కారిడార్ (రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం)లో నీరునిల్వ ఉంటుంది.

కుండపోత వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

- రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం
- లోతట్టు ప్రాంతాలను చుట్టుముడుతున్న వర్షపునీరు



గీతామందిరం రోడ్డులో గోడౌన్‌లోకి వచ్చిన నీటిని బయటకు తోడుతున్న సిబ్బంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచి స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పాతబస్తీ అతలాకుతలమైంది. పాతబస్తీలోని వించిపేట, ఇస్లాంపేట, కొత్తపేట తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. ప్రధానంగా ఆయా ప్రాంతాల్లోని వీధుల్లో ద్విచక్ర వాహనాలు నీటిలో తేలిఆడాయి. కార్లు ఇతర వాహనాల్లోకి నీరు చేరటంతో అవి కదలకుండా మొరాయించాయి.

ఇళ్లలోకి చేరిన వర్షపునీరు

మంగళవారం కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని సుబ్బరామయ్యవీధి, గీతామందిరం వీధి, డ్రైన్ వీధితో పాటుగా పలు వీధుల్లోని ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. గోడౌన్లలోకి నీరు చేరటంతో సరుకు పాడైపోయినట్లు వాటి యజమానులు చెబుతున్నారు. పలు సెల్లార్లలోకి వర్షపునీరు భారీగా చేరింది. దానికి తోడు బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి సైతం ఆయా ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు చేరుతోంది. గణపతిరావురోడ్డు, కుమ్మరి వీధి, బూరాడ వారి వీధి, సైకం వారి వీధి, అమ్మ హాస్పిటల్ వీధి తదితర ప్రాంతాల్లోనూ సెల్లార్లలోకి, లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి వర్షపునీరు చేరింది.

యూజీడీ మరమ్మతులకు గోతులు తీసి వదిలేసిన వీఎంసీ

పాతబస్తీలోని గులాంమొహిద్దీన్ వీధిలోని గీతా మందిరం వీధి చివరి, సైకంవారివీధి చివర, అలాగే డ్రైన్ వీధి చివర ఉన్న కూడళ్ల వద్ద మంగళవారం నగరపాలకసంస్థ సిబ్బంది అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులు చేపట్టారు. అందులో భాగంగా పది నుంచి 15 అడుగులు లోతు, 20 అడుగుల వెడల్పు గోతులు తీసి వదిలేశారు. వాటికి సరైన గట్టి అడ్డు పెట్టకపోవటంతో ఒక వ్యక్తి అందులో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సరైన ప్రణాళిక లేకపోవటంతో మరో వ్యక్తి వర్షపునీటిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది.

బిక్కుబిక్కుమంటున్న పశ్చిమ ప్రజానీకం

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో స్థానిక ప్రజానీకం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రధానంగా మరో నాలుగైదు రోజులు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ చెప్పటంతో మరింత భయాందోళనలకు గురవుతున్నారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజానీకం ఎప్పుడు ఏ విధమైన వార్త వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి పనుల మీద బయటకు వెళ్లిన వ్యక్తులు ఇద్దరు మ్యాన్‌హోల్, డ్రైన్లలో పడి మృతి చెందిన నేపథ్యంలో బయటకు వెళ్లి రావటానికి సైతం భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి.

అధికారుల నిర్లక్ష్యం

నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యం పాతబస్తీ వాసుల ప్రాణాలపైకి తీసుకొస్తుందని స్థానిక ప్రజానీకం వ్యాఖ్యానిస్తోంది. గోతులు తీసి వదిలేయకుండా స్థానికులు అటురాకుండా హెచ్చరించే ఏర్పాట్లు చేయకపోవటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు వర్షాలు భారీగా కురుస్తాయని తెలిసిన తరువాత గోతులు తీయటం ఏమిటంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

రేపు మాంసం విక్రయాలపై నిషేధం

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన నగరంలో మాంసం, చేపలు ఇతర మాంసం ఉత్పత్తుల విక్రయాలను నిషేధించామని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ అర్ధరాత్రి నుంచి విద్యాధరపురంలోని కబేళాకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు. వ్యాపారులు నిబంధనలు పాటించాలని చెప్పారు.